# గ్లోబల్ ఎయిడ్ టైమ్స్
# Global AID Times

సామాజిక సేవ కోసం ఏర్పాటైన ఈ పత్రికలో ప్రకటనలు ఇచ్చేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్యకు సంబంధించిన సమాచారం ఇవ్వాలన్న సంప్రదించగలరు. ఈ పత్రికలో విశిష్ట వ్యక్తులతోపాటు, సాధారణ వ్యక్తులు రాసే కథనాలు మాకు పంపితే ప్రచురిస్తాం. ప్రత్యేక అవసరాలు వ్యక్తులు తమ సమస్యలను అధికారులకు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళేందుకు మా పత్రిక సహకరిస్తుంది. మరింత సమాచారానికి, సలహాలకు, సూచనలకు
అడ్రసు : గ్లోబల్ ఎయిడ్, ప్లాట్ నెం. 26, సెక్టార్ - 8, ఎమ్.వి.పి. కోలని, విశాఖపట్నం - 17.
ఫోన్ : 90526 27070, 90524 27070

ప్రత్యేక మాస పత్రిక | 2015 | సంచిక-2


# అందరితో సమాన అవకాశాలు

## - కేంద్రమంత్రి గెహ్లాట్





### వికలాంగులకు పరికరాలు పంపిణీ చేసిన ప్రభుత్వం
### నెల్లూరులో మానసిక చికిత్సాలయం
### కేంద్రమంత్రి గెహ్లాట్ వెల్లడి

**మీడియా-కోఆర్డినేటర్:** వికలాంగులకు సమాజంలో అందరితో సమానంగా విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కేంద్ర మంత్రి దావర్ చంద్ గెహ్లాట్ అన్నారు. కేంద్ర వికలాంగుల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం (13-02-15) తేదిన 1353 మంది వికలాంగులకు 2777 ఉపకరణాలు, సహాయ పరికరాలు, వాహనాలు పంపిణీ చేశారు. ఏయూ క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కేంద్ర మంత్రి దావర్ చంద్ గెహ్లాట్ మాట్లాడుతూ ఇందులో 1.29 కోట్ల రూపాయల విలువైన పరికరాలు పంపిణీ చేశామన్నారు. వికలాంగులకు యునిక్ ఐడి నెంబరు కేటాయించి వారికి అందరితో సమానంగా విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ చదివే విద్యార్థులకు, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే వారికి రుణాలు ఇస్తామన్నారు. ఇంటి వద్ద నుండే వారు ఈలెర్నింగ్, ఆన్‌లైన్ ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న ఆరేళ్ల లోపు వయస్సు గల చిన్నారులకు ఆపరేషన్ నిమిత్తం రూ.6 లక్షల వరకు ఆర్థిక సహాయం మంజూరు చేస్తామన్నారు.80 శాతం పైబడిన (మిగతాది 3వ పేజీలో)

# "గ్లోబల్ ఎయిడ్ టైమ్స్" పత్రిక ప్రారంభించిన పరకాల



- ప్రత్యేక అవసరాల వారి కోసం పత్రిక ప్రారంభం
- ఎంతో గొప్ప ఆలోచన
- ప్రభుత్వ అండ ఉంటుంది ...పరకాల
- నా పూర్తి సహకారం అందిస్తా. ...మావూరి

**ఎం.వి.పి. కాలనీ :** ప్రత్యేక అవసరాలు కల్గిన వారి అభ్యున్నతి కోసం గ్లోబల్ ఎయిడ్ సంస్థ పత్రిక ప్రారంభించడం ఎంతో గొప్ప విషయం. విశిష్ట వ్యక్తుల కోసం గ్లోబల్ ఎయిడ్ సంస్థ నెలవారీ పత్రిక ప్రారంభించింది. 'గ్లోబల్ ఎయిడ్ టైమ్స్' పేరుతో రూపొందిన ఈ పత్రిక ఆవిష్కరణ ఎం.వి.పి. కాలనీ ఐ.ఐ.ఎ.ఎం. ఆవరణలో గురువారం (12-02-2015) జరిగింది. ఇందులో ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ ముఖ్య అతిధిగా పాల్గొని గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పరకాల మాట్లాడుతూ సమాజంలో బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లవుడూ కృషి చేస్తుందన్నారు. ప్రత్యేక అవసరాల వారికి ఐదు రెట్లు ఫించను పెంపుదల చేశామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రవేశ పెట్టిన స్వచ్ఛ్ భారత్ దేశాభివృద్ధికి దోహదపడు తుందన్నారు. (మిగతాది మూడవ పేజీలో)

# ఇంటర్వ్యూ

# మ్యాజిక్

## నా మనస్సుకు రిలాక్సేషన్

### ప్రపంచ ఇంద్రజాల దినోత్సవ సందర్భంగా నిరీక్షణ్‌రావుపై ప్రత్యేక కథనం

**ఎం.వి.పి. :** అబ్రకదబ్ర హూఫట్ ఇలాంటి పదం వినగానే మనకు మెజీషియన్ గుర్తొస్తారు. చిన్నారుల నుండి పెద్దల వరకు మ్యాజిక్ అంటే ఇష్టపడని వారుండరు. సాధారణ వ్యక్తులు మ్యాజిక్ చేయడం సామాన్య విషయమే. కాని ప్రత్యేక అవసరాలు కల్గిన వ్యక్తి మ్యాజిక్ చేస్తే అది నిజంగా అసాధారణం, అద్భుతం అనే చెప్పాలి. అలాంటి ప్రత్యేక మైన నిరీక్షణ్‌రావు కోసం గ్లోబల్ ఎయిడ్ ప్రత్యేక కథనం. సూరిశెట్టి నిరీక్షణ్‌రావు (29) గాజువాక ప్రాంత వాసి.



ఈయన తల్లి దండ్రులు అప్పల నాయుడు, మాణిక్యం. 1986 జూలై 9న అనకాపల్లి గవర పాలెంలో నిరీక్షణ్‌రావు జన్మించారు. ఇతను ఎంతో నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. దీనికి తోడు నిరీక్షణ్ పసితనం నుండి చర్మ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతని శరీరం అంతా గాయాలు వలె ఉంటాయి. పుండ్లులా ఏర్పడి రక్తం కారుతుంటుంది. ఎముకలు కూడా చాలా బలహీనంగా ఉంటాయి. దీంతో ఇతనికి దుస్తులు వేసిన వాటికి రక్తం అంటుకుని చాలా ఇబ్బందిగా ఉండేది. వ్యవసాయదారుడు, నిరుపేద అయిన నిరీక్షణ్ తండ్రి ఇతని వైద్యంకు బోలెడు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇక స్కూలుకు పంపాలంటే నిరీక్షణ్‌కు అనారోగ్యంతో పాటు తోటి విద్యార్థులకు ఇబ్బంది అని చేర్చలేదు. దాంతో ఆయన ఇంటికే పరిమితం అయ్యాడు. తన తోటి వారు స్కూలుకు వెళ్తుంటే ఇంట్లోనే ఉండిపోయిన నిరీక్షణ్ ఎంతో వేదనకు గురయ్యేవాడు. అయితే తనకు మాత్రం చదువుకోవాలని మనస్సులో దృఢమైన సంకల్పం ఉన్నా పరిస్థితులు, శరీరం సహకరించలేదు. ఇతని ఉత్సాహం గ్రహించి తన సోదరుడు అక్షరాలు నేర్పేవాడు. కొంత కాలానికి చదవడం అలవాటైంది. తర్వాత బైబిల్ చదవాలనే కోరిక కలగడంతో నిరీక్షణ్ ఎంతో పట్టుదలతో చదవటం ప్రారంభించాడు. నేటికి పదహారోసారి బైబిల్ చదువుతున్నాడు. అలాగే చర్చిలకు వెళ్లి చిన్నారులకు బైబిల్ కథనాలు (మిగతాది రెండవ పేజీలో)

# మ్యాజిక్
## నా మనస్సుకు రిలాక్సేషన్

### ప్రపంచ ఇంద్రజాల దినోత్సవ సందర్భంగా నిరీక్షణ్‌రావుతో ప్రత్యేక కథనం

(మొదటి పేజి తరువాత) వివరిస్తున్నాడు. 2012లో ఎన్.ఎ.డి. వద్ద ఉన్న యుగంధర్ అనే పాస్టర్ నిరీక్షణ్ పట్టుదల చూసి అతనికి మ్యాజిక్ నేర్పించాడు. తొలిత సరదాగా మ్యాజిక్ నేర్చుకున్నాడు. ఎంతో కష్టపడి చిన్న చిన్న ప్రదర్శనలపై పట్టు సాధించాడు. సుమారు 30 వరకు వైరైటీ కాన్సెప్ట్‌లు మ్యాజిక్ ద్వారా చేయగలుగుతున్నాడు. తొలత సరదాగా నేర్చుకున్న మ్యాజిక్ నేడు అతని అదే జీవనాధారం అయ్యిందని నిరీక్షణ్‌రావు చెప్పుతున్నాడు. ఇప్పటికి వందలాది మ్యాజిక్ ద్వారా ప్రదర్శనలు ఇస్తు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. డొనాల్డ్ డక్ షో కూడా ఈయన ప్రదర్శించగలడు. ఈయన ప్రదర్శన చిన్నారులకే కాకుండా పెద్దలకు ఎంతగానో ఆకట్టుకుటుంది. ఫిబ్రవరిలో జరిగిన మెజీషియన్ డే రోజు ఎం.వి.పి. కాలనీ గ్లోబల్ ఎయిడ్ కార్యాలయంలో తన ప్రదర్శన ద్వారా నిరీక్షణ్ అందర్నీ మెప్పించారు.

### మ్యాజిక్ నా జీవితాన్ని మార్చేసింది



నా శారీరక సమస్య వల్ల ఇంట్లోంచి బయటకు రాలేని పరిస్థితి. నా తోటి వారు స్కూలు డ్రస్సు వేసుకుని బడికి వెళ్తుంటే కుమిలిపోయిన రోజులు ఇప్పటికీ గుర్తే. వారితో నేను ఆడలేక, ఎముకల బలహీనతతో నరకం చూశాను. ప్రభువు దయవల్ల చదువు రాకపోయినా బైబిల్ చదివి అవగాహన చేసుకుని అందరికీ వాటి విశిష్టత వివరిస్తున్నాను. మా పాస్టర్ యుగంధర్ దయవల్ల నేను మ్యాజిక్ నేర్చుకున్నాను. నాటి నుండి నా జీవితం ఇంకా మారిపోయింది. అందరి ముందు ధైర్యంగా నిలబడి మ్యాజిక్ ప్రదర్శిస్తున్నాను. ఒకప్పుడు నన్ను జాలిగ చూసేవారు, నేడు నా ప్రదర్శన చూసి ఆశ్చర్యపడుతున్నారు. ఎంతో ఉత్సాహ పడుతున్నారు. డొనాల్డ్ డక్ షోతో అందర్నీ ఆహ్లాద పరుస్తున్నాను. ప్రభుత్వం అందిస్తున్న వికలాంగభృతితో పాటు మ్యాజిక్ వల్ల అపుడప్పుడు నాలుగు డబ్బులు వస్తున్నాయి. మ్యాజిక్ నా జీవితాన్ని మార్చింది.

**కృషి - పట్టుదల ఉంటే చాలు...**

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక బలహీనత ఉంటుంది. అలాగే సృజనాత్మకత కూడా దాగి ఉంటుంది. దానిని మనమే గుర్తించి, కృషి, పట్టుదలతో సాధన చేస్తే మంచి స్థాయికి చేరుతాం. దీనికి నా జీవితమే ఒక ఉదాహరణ అని గర్వంగా చెప్పుతాను. నాకు ఎంతో ప్రోత్సాహం అందించిన వారందరికి నా కృతజ్ఞతలు... నా ప్రదర్శన కావాల్సిన వారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించండి.

– నిరీక్షణ్, మెజీషియన్, గాజువాక
సెల్ : 92985 08305

# ప్రత్యేక అవసరాల వ్యక్తుల విద్యకు తోడ్పాటు

- విశాఖలో రూ.50 కోట్లతో విశిష్ట వ్యక్తులకు క్రీడా కాంప్లెక్సు
- వికలాంగుల పిల్లలకు 4శాతం వడ్డీకే రుణాలు
- డీఎస్సీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ





**అనకాపల్లి:** వికలాంగులు, పారిశుధ్య కార్మికులు, కుష్టు వ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి నాలుగు శాతం వడ్డీకే రుణాలు ఇవ్వనున్నట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికార శాఖ మంత్రి దావర్ చంద్ గెహ్లాట్ చెప్పారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం (15-02-15) వికలాంగులకు కృత్రిమ అవయువాలు, ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్య అతిధిగా పాల్గొన్న గెహ్లాట్ వికలాంగులకు పరికరాలు అందించారు. అంతకుమునుపు విశాఖలో, అనకాపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాల విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. గుంటూరులలో బ్రెయిలీ లిపి ప్రెస్‌ను నెలకొల్పనున్నట్టు మంత్రి వెల్లడించారు. ఆ ప్రెస్‌కు రూ.2 కోట్లను తాము మంజూరు చేస్తామని, అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. కర్నూలులో సెన్సర్ పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. వివిధ రకాల శబ్దాలు గ్రహించేలా అంధులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ పార్కు దోహదపడుతుందన్నారు. దక్షిణ భారత దేశానికి సంబంధించిన క్రీడా కాంప్లెక్స్‌ను రూ.50 కోట్లతో విశాఖలో నెలకొల్పుతామని మంత్రి చెప్పారు. ప్రతీ జిల్లాలో మానసిక చికిత్సా పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరులో మానసిక చికిత్సా పునరావాస ప్రాంతీయ కేంద్రం నెలకొల్పుతామన్నారు. సామాజిక న్యాయశాఖకు రూ.6,500 కోట్లు, వికలాంగుల సంక్షేమానికి రూ.565 కోట్లు బడ్జెట్ కేటాయించారన్నారు. వచ్చే బడ్జెట్‌లో ప్రస్తుత కేటాయింపులపై ఇరవై శాతం పెంచనున్నట్టు చెప్పారు. రాష్ట్ర మానవ వనరుల శాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ డీఎస్సీలో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ పక్కాగా అమలు చేస్తామన్నారు. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పీతల సుజాత, పల్లె రఘునాథరెడ్డి, ఎంపీలు అవంతి శ్రీనివాసరావు, కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఏయూ నాకు ఉపాధిని ఇచ్చింది

**ఏయూ :** ఆంధ్రా యూనివర్సిటీ దేశంలోనే ఎంతో ప్రాముఖ్యమైంది. ప్రతీ ఏడాది వేలాది మందికి విద్యను దానం చేస్తోంది. వందలాది మందికి ఉపాధిని ఇస్తుంది. ఇదే కోవలో ప్రత్యేక అవసరాలు కల్గిన తనకు కూడా ఏయూ ఉపాధి అవకాశం కల్పించిందని సిహెచ్.రమణమ్మ అంటున్నారు. పోలియో బారిన పడిన రమణమ్మ ఏయూ ఔట్ గేట్ వద్ద నివాసముంటోంది. నిరుపేద కుటుంబానికి చెందింది. కుటుంబ ప్రోత్సాహంతో కష్టపడి ఎం.కామ్ చదివారు. శారీరక వికలాంగురాలు కావడంతో వివాహం జరుగలేదు. నిరుపేదరాలైనా ఎంతో ఆత్మవిశ్వాసం కూడగట్టుకుని విద్యను అభ్యసించారు. ఏయూ కరస్పాండెన్స్ కోర్సు విభాగంలో ఉద్యోగం చేస్తోంది. నెలకు ఎనిమిది వేల రూపాయల వరకు సంపాదించుకుంటోంది. ఎం.ఎం.జి. హాస్టల్‌లో తాను విద్యాభ్యాసం చేశానని రమణమ్మ చెప్పారు. ఎస్.జాన్ డేవిడ్, పీని మేడమ్, అరుణ్‌కుమార్ మహంతి సహకారంతో తాను ఎం.కామ్ చదివానని చెప్పారు. వైకల్యంతో ఉన్న వారికి కుటుంబ సభ్యులు తోడ్పడితే జీవితంలో వారు నిలదొక్కుకుంటారని ఆమె చెప్తున్నారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా ఏయూలో మాత్రం ఈమె విధులు నిర్వహిస్తున్న చోట లోపలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతోంది. ఆటోలో వచ్చాక లోపలకు వెళ్లేందుకు మెట్లు అడ్డుగా ఉన్నాయి. ప్రత్యేక అవసరాలు కల్గిన వారు ప్రయాణించేందుకు కాస్త సులభతరమైన మార్గం ఉండాలి. కాని ఏయూ కరస్పాండెన్స్ భవనం లోపలకు వెళ్లేందుకు మెట్లు మాత్రమే ఉన్నాయి. దీని వల్ల ఏయూ కరస్పాండెన్స్ కోర్సుకు వచ్చే ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు, సిబ్బందికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

**కరస్పాండెన్స్ విభాగంలోకి వెళ్లే మార్గం సులభతరం చేయాలి....**

నాకు ఏయూ విద్యను, ఉపాధిని ఇస్తోంది. మాలాంటి వారికి ఎంతో మందికి ఏయూ ఆసరాగా నిలిచింది. కాకపోతే ఏయూలో కొన్ని వసతులు కల్పించాలి. నేను రోజూ ఆటోలో కరస్పాండెన్స్ భవనం వరకు వస్తాను. ఆటో లోంచి నేరుగా మెట్లపైకి నానా అవస్థలు పడి తిగుతాను. లోపలకు వెళ్లేందుకు కూడా తంటాలు పడాలి. ఇక్కడ కరస్పాండెన్స్ కోర్సు భవనం వద్ద మెట్లు మార్గంలో కొంత భాగం ప్రత్యేక అవసరాలు కల్గిన వారు సజావుగా వెళ్లేలా ఏర్పాటు చేయాలి. దీనివల్ల ఏయూ మావంటి వారికి పూర్తి న్యాయం చేసినట్లవుతుంది.



సి.హెచ్.రమణమ్మ
ఏయూ ఉద్యోగిని,
కరస్పాండెంట్స్ విభాగం

# అందరితో సమాన అవకాశాలు



(మొదటి పేజీ తరువాయి) అవయువ లోపం కల్గిన వారికి మోటారు ట్రై సైకిళ్ల సబ్సిడీపై ఇస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు మూడు శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. స్వయం ఉపాధి నిమిత్తం 30 లక్షల రుణం అందిస్తామన్నారు. దేశంలో వికలాంగులకు ఐదు క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని వాటిలో ఒకటి విశాఖలో నెలకొల్పుతున్నామన్నారు. విశాఖలో క్రీడా మైదానంకు రూ.10కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. నెల్లూరులో ఐదెకరాల్లో 2 కోట్ల రూపాయలతో మానసిక చికిత్సా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో మూడు శాతం ఉద్యోగాలు వికలాంగులకు ఇచ్చేందుకు తగిన చర్యలు చేపడుతున్నా మన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు భీమా, ఫించను సౌకర్యం కల్పించేందుకు కేంద్రం ఆలోచిస్తుందన్నారు. కాళ్ళు లేకపోయినా అద్భుతంగా నాట్యం చేయగల కళాకారిణి సుధాచంద్రన్ జీవితంపై రామోజీరావు 'మయూరి' చిత్రాన్ని తీశారన్నారు. ఆమె లాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటిస్తామన్నారు. ఎం.పి. కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లపుడూ కృషి చేస్తుందన్నారు. వికలాంగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మూడు చక్రాల బ్యాటరీ వాహనాలు,



సాధారణ సైకిళ్లు, ఇతర పరికరాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్, విష్ణుకుమార్ రాజు, ముత్తంశెట్టి శ్రీనివాస్, జెడ్.పి. ఛైర్ పర్సన్ లాలం భవాని, కలెక్టర్ యువరాజ్, ఏయూ వీ.సి. జి.ఎస్.ఎన్. రాజు, రిజిస్ట్రార్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికలాంగులు ప్రదర్శించిన భరతనాట్యం, పులివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

# గ్లోబల్ ఎయిడ్ పత్రిక ప్రారంభించిన పరకాల



(మొదటి పేజి తరువాత) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ్ భారత్‌ను ముందుకు నడిపిస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తున్నారన్నారు. గ్లోబల్ ఎయిడ్ సంస్థతో తమకు మంచి అనుబంధ ముందన్నారు. ఈ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో హర్షణీయంగా ఉందన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేక మాస పత్రిక గ్లోబల్ సంస్థ విడుదల చేయడం అభినందనీయ మన్నారు. ఈ పత్రిక మంచి మనుగడ సాగించి ప్రత్యేక అవసరాల వారికి ఎంతో దోహద పడాలన్నారు.

**పరకాల ప్రభాకర్,** ప్రభుత్వ సలహాదారులు



**వికలాంగులకు చేయూత నివ్వాలి:** సి.ఎం.ఆర్. మరియు ఎం.వి.ఆర్. షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వికలాంగులకు సహాయం చేద్దాం. అవయువాలు బాగున్న వారందరూ సమిష్టిగా కృషి చేసి వికలాంగులకు చేయూతనిస్తే ఎంతో బాగుంటుంది. గ్లోబల్ ఎయిడ్ వ్యవస్థాపకురాలు సాయి పద్మ సూచన మేరకు తన నిర్మించిన సి.ఎం.ఆర్. సెంట్రల్‌లో వికలాంగుల కోసం ప్రత్యేక మార్గం, టాయిలెట్లు, ఇతర సదుపాయాలు కల్పించాం. గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ పత్రికకు నా ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుంది.

**మావూరి వెంకటరమణ,** సి.ఎమ్.ఆర్. & ఎమ్.వి.ఆర్. సంస్థల అధినేత

**మంచి సంకల్పంతో గ్లోబల్ ఎయిడ్ టైమ్స్‌ను ప్రారంభించాం...**



గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ప్రజ్ఞానంద్ మాట్లాడుతూ ఎంతో మంచి సంకల్పంతో గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ ప్రారంభించామన్నారు. ఇది సాధారణ వ్యక్తులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఏదైనా ప్రాంతంలో వికలాంగులకు సంబంధించిన సంస్థలు వివరాలు, ఇతర విషయాలు ఇందులో పొందుపరుస్తా మన్నారు. వికలాంగుల అందించే చేయూత మాకు తెలియపరించిన, ఈ-మెయిల్ ద్వారా పంపిన గ్లోబల్ ఎయిడ్ టైమ్స్‌లో ప్రచురిస్తాం.

**ప్రజ్ఞానంద్,** గ్లోబల్ టైమ్స్ వ్యవస్థాపక కార్యదర్శి

**పత్రిక ద్వారా మరిన్ని సేవలు చేయాలి....**



ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నాగార్జున యూని వర్శిటీ విశ్రాంత ఉపకులపతి ప్రొఫెసర్ బాల మోహన్ దాస్ మాట్లాడుతూ నెల రోజుల వయసులో పోలియో బారిన పడిన గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాప కురాలు సాయి పద్మ ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. పద్దెనిమిది మేజర్ ఆపరేషన్లు జరిగినా ఎంతో మానసిక ధైర్యంతో నిలదొక్కుకున్నారు. గ్లోబల్ ఎయిడ్ సంస్థ స్థాపించి ప్రత్యేక అవసరాల వారికి నిర్విరామంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కేవలం ప్రత్యేక అవసరాల వారి కోసం ఈ పత్రిక స్థాపించడం హర్షనీయం. ఈ పత్రిక ఎంతో మందికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

**ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్,** నాగార్జున యూనివర్సిటీ, విశ్రాంత ఉపకులపతి.

**వికలాంగుల సంక్షేమం కోసమే పత్రిక :**



గ్లోబల్ ఎయిడ్ వ్యవస్థాపకురాలు సాయిపద్మ మాట్లాడుతూ నాకు వికలాంగుల సమస్యలు స్వానుభవంతో తెలుసు. సమాజంలో విద్య, ఉపాధి, క్రీడలు, వ్యాపారాలు, సినిమాలు తదితర ఇలా ఎన్నో అంశాలపై పత్రికలున్నాయి. కాని వికలాంగులకు పత్రికలు లేవు. కేవలం వికలాంగుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం, విద్య, ఉపాధి, ఆరోగ్యం, అడ్రసులు, సలహాలు, సూచనలు ఇలా ఎన్నో అంశాలు గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ పత్రిక పనిచేస్తుంది. ప్రతీ నెల ప్రత్యేక అవసరాల వారి కోసం పాటు పడే సంస్థలు, విశిష్ఠ వ్యక్తులు సాధించిన విజయాలపై అంశాలు ప్రచురిస్తాం. ఇదీ ప్రతీ ఒక్కరూ తమ వద్ద ఉంచుకునే ముఖ పత్రికగా తీర్చిదిద్దుతాం. మా ప్రయత్నానికి ప్రతీ ఒక్కరూ సహకరించి, ప్రోత్సహించాలని కోరుతున్నాం.

**సాయిపద్మ,** గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు

**చాలా ఆనందంగా ఉంది :**



గ్లోబల్ ఎయిడ్ సంస్థ ఇటువంటి వినూత్న మైన సమాచారంతో కూడిన పత్రికను ప్రారంభించడం గొప్ప విషయం. ప్రస్తుత కాలంలో ప్రత్యేక అవసరాల వారి కోసం పత్రిక చాలా అవసరం. గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ వారికి ఎన్నో విధాలుగా తోడ్పడుతుంది. ఈ పత్రికకు కావలసిన సమాచారంలో నా వంతు సహకారం అందిస్తాను. మిగతా సంస్థల వారు ప్రోత్సహించాలని కోరుతున్నాను. ప్రత్యేక అవసరాల వారి అభ్యున్నతకి అందరం కృషి చేద్దాం.

**ఛాయ,** గ్లోబల్ ఎయిడ్ టైమ్స్, వ్యవస్థాపక సభ్యురాలు

ఈ కార్యక్రమంలో గ్లోబల్‌ఎయిడ్ టైమ్స్ సబ్ ఎడిటర్ జోగారావు, ఇతర ప్రతినిధులు మీనాక్షి, భాస్కరరావు, శైలజ, శ్రీనివాస్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధిమాంధ్యం వారి 'శ్రేయ'స్సుకు 'ఉష' కిరణం



**మీడియా-కోఆర్డినేటర్ :** బుద్ధిమాంధ్యం అని వినగానే ఈ లోకంలో వారందరూ ప్రత్యేకమైన వారని గ్రహించవచ్చు. ఎన్నేళ్ళొచ్చినా అభం శుభం తెలియని పసివారితో సమానం. వారి పనులు సొంతంగా చేసుకోవాలంటే కష్టమే. వేరొకరి మీద ఆధారపడాల్సిందే. వారే బుద్ధిమాంధ్యం కలవారు. వీరిని చూస్తే ఎవరికైనా జాలి కలగక తప్పదు. లోకమెరుగని పసిమనసు కలవారు. ఎన్నేళ్లొచ్చినా వీరు అంతేనా?.. అది ఒకప్పటి మాట. నేడు వారు కూడా తమ పనులు సొంతంగా చేసుకునేలా తీర్చిదిద్దొచ్చు డాక్టర్ ఉషాదేవి చెప్తున్నారు. ఈమె అనకాపల్లిలో శ్రేయ ఫౌండేషన్ స్థాపించి బుద్ధిమాంధ్యం కలవారికి శిక్షణ ఇచ్చి వారి పనులు వారే చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

## శ్రేయ ఫౌండేషన్‌పై గ్లోబల్ ఎయిడ్ టైమ్స్ ప్రత్యేక కథనం...



శ్రేయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఉషాదేవి. ఆమె తల్లిదండ్రులు పి.ఎస్.ఎన్.మూర్తి, రమాసుందరి. వీరిద్దరూ ఉపాధ్యాయులు. ఉషాదేవి అనకాపల్లిలో పుట్టి పెరిగారు. ఈమె **భర్త శ్రీనగేష్, సి.ఐ.డి. డిపార్టమెంట్‌లో ఇన్‌స్పెక్టర్**. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సింధూష్. ఇంజనీరింగ్ చదువుతోంది. రెండో కుమార్తె మనోజ్ఞ. సి.ఎ. చదువుతోంది. ఉషాదేవి ఏయూలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించేవారు. 2005 నవంబర్ 14 న శ్రేయ ఫౌండేషన్ అనకాపల్లిలో స్థాపించారు.

**శ్రేయ ఫౌండేషన్ ఉద్దేశ్యం...** బుద్ధిమాంధ్యం కల్గిన వారికి ఆసరాగా నిలవాలనే లక్ష్యంతో శ్రేయ ఫౌండేషన్ స్థాపించినట్టు ఉషాదేవి చెప్పారు. తన మేన కోడలు ఇంద్రజ బుద్ధిమాంధ్యంతో పుట్టింది. స్వతహాగా సైకాలజీ కోర్సు చేసిన ఉషాదేవి ఆమెను కొన్నేళ్లు పరిశీలించారు. బుద్ధిమాంధ్యం కలవారి కోసం పాటు పడాలనే శ్రేయ ఫౌండేషన్ స్థాపించారు. ఆమె యునైటెడ్‌నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో పనిచేసే సమయంలో విదేశాలు వెళ్ళారు. అక్కడ బుద్ధిమాంధ్యం కల్గిన పిల్లలకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారో స్టడీ చేశారు. ఇండియా వచ్చి దేశంలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థలన్నీ పరిశీలించి తర్వాత శ్రేయ ఫౌండేషన్ స్థాపించారు. కేవలం 5 గురు చిన్నారులతో స్థాపించబడ్డ ఈ ఫౌండేషన్‌లో నేడు 73 మంది బుద్ధిమాంధ్యం కల్గిన చిన్నారులకు ఆశ్రయం కల్పిస్తోంది. 23 మందికి హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నారు. 100 మంది వరకు మాత్రమే చేర్చుకుంటామని ఆమె చెప్పారు.

**శ్రేయ ఫౌండేషన్ లక్ష్యాలు...** ఈ సంస్థలో చేర్చిన బుద్ధిమాంధ్యం కల్గిన చిన్నారులకు బ్రష్ చేసుకోవడం, టాయ్‌లెట్ వస్తే చెప్పడం, మలమూత్ర విసర్జనలు వెళ్లాక సొంతంగా శుభ్రం చేసుకోవడం, స్నానం, బట్టలు వేసుకోవడం, తినటం వంటివి నేర్పుతారు. అలాగే ఆటలు, క్రియేటివిటీగా పనులు చేయడంతో పాటు త్వరలో కొన్ని రకాల ఒకేషనల్ కోర్సులు నేర్పుతారు. బుద్ధిమాంధ్యం పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు ఇవ్వడం శిక్షణ కల్పిస్తారు. ఫినాయిల్, సబ్బులు వంటివి వారిచే తయారు చేయించి వాటి విక్రయం ద్వారా వచ్చిన నగదు తిరిగి వారికే ఉపయోగిస్తారు. కొన్నేళ్లలో వారిని సాధారణ మనుషుల స్థాయికి తీర్చిదిద్దుతారు. వారి పనులు స్వయంగా చేసుకునేలా శిక్షణ ఇస్తూ తమపై తమకు నమ్మకం పెరిగేందుకు, జీవితంలో స్థిరపడేందుకు, వేరొకరిపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేందుకు బుద్ధిమాంధ్యం కల్గిన వారికి శ్రేయ ఫౌండేషన్ బాసటగా నిలుస్తోంది.

## పసితనంలో గుర్తించి తీసుకురండి....

బుద్ధిమాంధ్యం కల వారిని ఎవరూ చులకనగా చూడొద్దు. సాధారణ వ్యక్తులు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎన్నటికైనా తమ తల్లిదండ్రులను విడనాడుతారు. బుద్ధిమాంధ్యం కలవారు ఎన్నేళ్లైనా తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను విడనాడరు. కాకపోతే వారిని ముందే గుర్తించి శిక్షణ ఇస్తే సరిపోతోంది. మూడు నెలలకు పసివారు మెడ నిలబెట్టడం, బోర్లాపడటం, పాకడం, లేగిచేందుకు, ఊత పట్టుకుని నడిచేందుకు ప్రయత్నిస్తుంటారు. తొమ్మిది నెలలకు పసివారు కూర్చోవాలి. రెండు అక్షరాల పదాలు మాట్లాడేందుకు వారు ప్రయత్నిస్తుంటారు. ఇవి మైలురాళ్ళు. వీటిలో ఏ రెండెంటికన్నా తక్కువ చేస్తుంటే తల్లిదండ్రులు జాగ్రత్తపడి మమ్మల్ని సంప్రదించాలి. వారికి బుద్ధిమాంధ్యం ఉందో లేదో మేము చెక్ చేసి చెప్తాం. బుద్ధిమాంధ్యం కలవారిలో ఓవర్ నెగ్లిజెన్సీ (వారిని అసలు పట్టించుకోకపోవడం, రెండోది ఓవర్ ప్రొటాక్షన్ (వారిపై ఎక్కువ శ్రద్ధ చూపడం) వంటివి కుటుంబ సభ్యులు చేస్తుంటారు. దాని వల్ల వారిలో బద్ధకంతో పాటు తాము ఏపని చేయలేమన్న భావన పెరిగి చాలా ధీనంగా తయారవుతారు. అలా కాకుండా వారిని మా వద్దకు తీసుకువస్తే పసితనం నుండి వారి పనులు వారు చేసుకునేందుకు శిక్షణ ఇస్తాం. ఎంతో శ్రమతో కూడినదే అయినా వారికి పసితనం నుండి భవిష్యత్‌లో వారు ఎవరిపై ఆధారపడకుండా ఉండేలా శిక్షణ ఇస్తాం. దీనికి మావద్ద ట్రైనర్లు, ఇద్దరు స్పీచ్ అండ్ ఫిజియోథెరపిస్టులు, నృత్య శిక్షకులు ఉన్నారు. ముఖ్యంగా బుద్ధిమాంధ్యం కల్గినవారు చాలా తెలివైనవారు. వారిని సమాజానికి ఉపయోగపడేలా చేయడమే మా లక్ష్యం. దీని కోసం నేను ఎంత డబ్బు, కాలం, శ్రమ వెచ్చించేందుకు అయినా సిద్ధమే. నాకు నా భర్త, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతో ప్రోత్సాహిస్తున్నారు. అలాగే ప్రభుత్వం కూడా కాస్త సహకరిస్తే ఇంకా ఎంతో చేస్తాను.

- **డాక్టర్ ఉషాదేవి,** శ్రేయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు
ఆశ్రేయధామ్ మనోవికాస కేంద్రం, 6-10-5, న్యూకాలని,
విజయ హాస్పిటల్ ప్రక్కన, అనకాపల్లి. **సెల్ : 9949770788**

# గ్లోబల్ ఎయిడ్ ఆధ్వర్యంలో వీల్‌ఛైర్ల పంపిణీ




**ఎం.వి.పి. కాలనీ:** స్వచ్ఛంద సంస్థలు వల్ల సమాజంలో ఎంతో మందికి మేలు జరుగుతోందని ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థలు గ్లోబల్ ఎయిడ్, పి.వి.ఆర్. ట్రస్ట్, ఆశాజ్యోతి (యు.ఎస్.ఎ. అండ్ ఇండియా) ఆధ్వర్యంలో నిరుపేద వికలాంగులకు వీల్‌ఛైర్‌లు పంపిణీ జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ తాను కూడా గతంలో రోటరీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థలు అనాథలు, అభాగ్యుల పాలిట బాసటగా నిలుస్తున్నాయన్నారు. గ్లోబల్ ఎయిడ్ చేస్తున్న సేవలు తనకు బాగా తెలుసన్నారు. ఈ సంస్థ సేవలు హర్షణీయమన్నారు. గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు సాయి పద్మ మాట్లాడుతూ ఈరోజు ఐదు శారీరక, ఐదు మానసిక వికలాంగులకు వీల్‌ఛైర్లు అందిస్తున్నామన్నారు. తమ సంస్థతో పాటు పి.వి.ఆర్. ట్రస్ట్, ఆశాజ్యోతి సంస్థలు దీనికి సహకరించాయన్నారు. గ్లోబల్ ఎయిడ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఎయిడ్ సంస్థ ద్వారా సేవలందించిన యువకులకు సర్టిఫికెట్‌లు అందించారు. అనంతరం వీల్‌ఛైర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.వి.ఆర్. ట్రస్ట్ ప్రతినిధి వెంకట్ పంచుమర్తి, ఆశాజ్యోతి ప్రతినిధి మాధవిలత, గ్లోబల్ ఎయిడ్ సంస్థ కార్యదర్శి ప్రజ్ఞానంద్, మీనాక్షి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.